

వృక్షవిలాపం..!

- లక్షల మొక్కలకు కన్నీరే...
- తిరిగిరాని లోకాలకు వృక్షమాత
- ఆశయం కోసం దశాబ్దాల పోరాటం
- మొక్కలనే బిడ్డలనుకున్న మహాతల్లి
- నేడు అధికార లాంఛనాలతో తిమ్మక్క అంత్యక్రియలు
- నివాళి అర్పించిన సీఎం

రాష్ట్రంలో లక్షల మొక్కలకు కన్నీరే మిగిలింది. ఎదిగిన వృక్షాలు సైతం చంటి పిల్లలా రోదిస్తున్నాయి. తమను పెంచి , పోషించి కన్నబిడ్డలా చూసుకున్న వృక్షమాత సాలుమరద తిమ్మక్క కన్నుమూయడంతో మొక్కలు, వృక్షాలు తమ కన్నతల్లిని తలుచుకుని బోరున విలపిస్తున్నాయి. శుక్రవారం వృక్షమాత సాలుమరద తిమ్మక్క కన్నుమూసిన వార్త రాష్ట్రవ్యాప్తంగా విషాదం నింపింది. ఎందరో పర్యావరణ ప్రేమికులు ఆమె సేవలను తలుచుకుంటూ నివాళి అర్పించారు.

బెంగళూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆమెను చూస్తే ఎంతటివారైనా చేతులెత్తి నమస్కరిస్తారు... ఆమెతో ఓ ఫొటో తీసుకుని గుర్తుగా ఉంచుకుందామని వెంట పడతారు. ఇంతకూ ఆమె గొప్పతనం ఏమిటంటే మొక్కలను కన్నబిడ్డలుగా భావించారు. అది ఒకటి రెండేళ్లు కాదు ఆరేడు దశాబ్దాలకుపైగానే. ఆమె నిరంతర సాధనకు కోట్లాదిమంది చదువుకునే పాఠ్యాంశమయ్యారు. బహుశా ప్రతిరంగంలోని వారికి బిరుదులు ఉంటాయి. మొక్కలను వృక్షాలుగా ఎదిగేందుకు చేసిన ఆమె కృషికి జాతిమొత్తం వృక్షమాతగా కొనియాడుతుంది. అంతటి పేరొందిన 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత సాలుమరద తిమ్మక్క (114) కానరాని లోకాలకు చేరారు. వయోభారం ఆరోగ్య సమస్యలతో రెండేళ్లుగా తరచూ ఆసుపత్రికి వెళ్లేవారు. కాలుజారి కిందపడిననాటి నుంచి మరింత ఇబ్బంది పడ్డారు. రెండురోజులక్రితం తీవ్రమైన శ్వాసకోశ సమస్య తలెత్తడంతో జయనగర్‌లో ఆమె నిరంతరంగా వైద్యం పొందుతున్న అపోలో ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స ఫలించక శుక్రవారం ఉదయం 10.45 గంటలకు తుదిశ్వాస వీడారు. కేవలం కొన్ని క్షణాలలోనే రాష్ట్రమంతటా సాలుమరద తిమ్మక్క ఇక లేరనే విషయం తెలిసింది. పాఠశాలలతో పాటు పలు ప్రజాసంఘాలు సంతాపం తెలిపాయి.



నాటి రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకుంటూ..



హులికల్ వద్ద సాలుమరద తిమ్మక్క పెంచిన చెట్లు



నాటి గవర్నర్ నుంచి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు పత్రం అందుకుంటూ..

పుట్టింది తుమకూరు జిల్లాలో...

తుమకూరు జిల్లా గుబ్బి తాలూకాలో జన్మించిన తిమ్మక్క, రామనగర జిల్లా మాగడి తాలూకా హులికల్ గ్రామానికి చెందిన చిక్కయ్యను వివాహం చేసుకున్నారు. కొంతకాలం పిల్లలు కలుగుతారని భావించారు. అయితే ఏళ్లు గడుస్తున్నా వారికి సంతానసౌభాగ్యం సాధ్యం కాలేదు. మనసులో అదే ఆలోచనతో ఉండరాదని భావించి మొక్కలను పెంచడం అలవాటుగా చేసుకున్నారు. హులికల్ గ్రామంనుంచి రాష్ట్ర రహదారి 94లో రోడ్డుకు ఇరువైపులా 385 మర్రిమొక్కలు నాటారు. వాటికి ప్రతిరోజూ నీరు పోయడం, పశువులు నాశనం చేయకుండా కంచె ఏర్పాటు చేసి భార్యాభర్తలు పర్యవేక్షించేవారు. గ్రామస్థులతోపాటు సమీపవాసులు వీరు చేస్తున్నది ఏం పనో రోడ్డు పక్కన చెట్లను పెంచడం ఇదే పని అంటూ ఎద్దేవా చేసిన వారు ఉన్నారు. కానీ ఎవరేమనుకున్నా సాలుమరద తిమ్మక్క మాత్రం అనుకున్న ఆశయానికి అనుగుణంగానే కొనసాగారు. చదువు లేకున్నా ఎంతటి ఉన్నతాధికారితోగానీ సమస్యను తెలిపి పరిష్కారమార్గం చూపేవారు. ఇలా 65ఏళ్లకుపైగా ఆమె ఒకే సాధనతో చెట్లు పెంచుకుంటూ వెళ్లారు. ఇలా వివిధ ప్రాంతాలలో ఆమె నాటిన మొక్కలు చెట్లుగా పెరిగాయి.

సీఎం సహా ప్రముఖుల సంతాపం

సాలుమరద తిమ్మక్క మృతి చెందిన విషయం తెలియగానే సీఎం సిద్దరామయ్య ఆసుపత్రికి వెళ్లి పార్థివదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. సాలుమరద తిమ్మక్క ఆశయమైన ఆమె ఉపయోగించిన వస్తువుల ప్రదర్శన శాల ఏర్పాటు విషయమై చర్చిస్తామని సీఎం హామీ ఇచ్చారు. అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె సహా పలువురు మంత్రులు, అధికారులు, సమాజసేవకులు, సినీ నటులు ఆసుపత్రికి వెళ్లి సంతాపం తెలిపారు.



తిమ్మక్క భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న సీఎం సిద్దరామయ్య

ఎన్నెన్నో పురస్కారాలు..

సాలుమరద తిమ్మక్కకు కేంద్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన పద్మశ్రీ పురస్కారాన్ని అందించారు. 1995లో జాతీయ పౌర పురస్కారం, 1997లో ఇందిరా ప్రియదర్శిని వృక్షమిత్ర పురస్కారం, 2019లో పద్మశ్రీ పురస్కారం దక్కింది. రాజ్యోత్సవ, ఆర్ట్ ఆఫ్ లివింగ్, నాడోజాతోపాటు 2020లో కర్ణాటక కేంద్రీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆమె వృద్ధాప్యంలో ఒంటరిగా ఉండాల్సి వస్తుందని ఉమేశ్‌ను పెంపుడు కొడుకుగా స్వీకరించారు. ఆమె వెంటే ఉంటూ నిరంతరం ఉమేశ్ సేవలు కొనసాగిస్తుండేవారు.

నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

సాలుమరద తిమ్మక్క పద్మశ్రీ పురస్కారంతో పాటు పర్యావరణ రాయబారిగా వ్యవహరించిన మేరకు రాష్ట్రప్రభుత్వం ఆమె మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గౌరవార్థం అంత్యక్రియలను అధికార లాంఛనాలతో జరపాలని సీఎం ఆదేశించారు. శనివారం అంత్యక్రియలకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

జీతభత్యాలు తీసుకోను

- జేడీఎస్ ఎమ్మెల్యే శరణగౌడ కందకూర్



బెంగళూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉత్తరకర్ణాటక సమస్యలపై సమగ్ర చర్చలు జరగాలనే కారణంతో ఏటా బెళగావి సువర్ణసౌధలో శాసనసభ శీతాకాల సమావేశాలు జరుపుతున్నా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోతోందని, అందుకే ప్రభుత్వం నుంచి ఏవిధమైన జీతభత్యాలు స్వీకరించేది లేదని జేడీఎస్ ఎమ్మెల్యే శరణగౌడ కందకూర్ పేర్కొన్నారు. బెళగావిలో మీడియాతో మాట్లాడిన ఆయన ఉత్తరకర్ణాటక జిల్లాలకు సంబంధించిన ఎన్నో సమస్యలు ఉన్నాయని వాటిపై చర్చలకు అవకాశం కల్పించాలని స్పీకర్ యూటీ ఖాదర్‌కు లేఖ రాశానన్నారు గురుమిట్కల్ నియోజకవర్గం నుంచి బెళగావి సమావేశాలకు వచ్చి వెళ్లే రవాణా ఖర్చులతో పాటు వేతనం, ఇతర భత్యాలను స్వీకరించేది లేదని లేఖలో పేర్కొన్నానన్నారు. ఉత్తరకర్ణాటక సమస్యలు పరిష్కరించాలనే బెళగావిలో ఏటా శాసనసభ శీతాకాల సమావేశాలు జరుపుతారని, అందుకుగాను రూ.30కోట్లదాకా ఖర్చు అవుతుందన్నారు. ఇలా ఏటా కోట్లాదిరూపాయలు ఖర్చు చేస్తున్నా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. శాసనసభ సమావేశాలకు హాజరవుతానని బయట నుంచి భోజనం తెప్పించుకుంటానని కనీసం టీ, కాఫీలు కూడా సువర్ణసౌధలో తీస్కునేది లేదన్నారు. ఉత్తరకర్ణాటక ప్రాంతానికి చెందిన వారిలో ఎక్కువమంది రైతులు, పేదలు, కార్మికులే అధికంగా ఉన్నారన్నారు. ఎన్నో సమస్యలతో దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్నారన్నారు. శాసనసభ్యులు విహారయాత్రలా భావించి వచ్చి వెళ్తున్నారన్నారు.

జనవరి 10 వరకు తుంగభద్ర నీరు

- తరువాత క్రస్ట్‌గేట్లు అమర్చే పనులు
- రబీకి మొండిచెయ్యి
- ఐసీసీ సమావేశంలో తీర్మానం



ఐసీసీ సమావేశంలో మాట్లాడుతున్న జలవనరుల శాఖ మంత్రి డీకే శివకుమార్, ఐసీసీ చైర్మన్ శివరాజ్‌తంగడిగె, హాజరైన ఎమ్మెల్యే, ఇతర ఎమ్మెల్యేలు

బళ్లారి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నుంచి పంట కాలువలకు జనవరి 10వ తేదీ వరకు నీరు వదిలేలా ఐసీసీ సమావేశంలో నిర్ణయించారు. పంట కోతలు పూర్తయ్యే వరకు వదలాలని తీర్మానించారు. శుక్రవారం బెంగళూరులోని నీటిపారుదల శాఖ భవనంలో జలవనరుల శాఖ, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఐసీసీ కమిటీ చైర్మన్ మంత్రి శివరాజ్ తంగడిగే అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. తుంగభద్ర బోర్డులోని కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల ఇంజనీర్లు, బోర్డు చైర్మన్‌తోపాటు బళ్లారి, సిరుగుప్ప, కంప్లి, కొప్పళ, విజయనగర, రాయచూరు ఎమ్మెల్యేలు, మంత్రులు నాగేంద్ర, గణేష్, బోసురాజు, రాఘవేంద్ర హిట్నాల్, రైతు సంఘం నాయకులు హాజరయ్యారు. తుంగభద్ర జలాశయంలో శుక్రవారానికి 75.989 టీఎంసీల నీరు నిల్వ ఉందనీ, ప్రస్తుతం డ్యాం ఆయకట్టులో పంటను కాపాడేందుకు నీటిని వినియోగించేలా తీర్మానించారు. జనవరి నాటికి డ్యాం పరిధిలో ఉండే అన్ని కాలువలకు నీరు వదలాలని నిర్ణయించారు. ఇందులో ఇప్పటివరకూ ఆంధ్ర కోటా కింద దిగువ, ఎగువ కాలువలకు వదిలిన నీరు.. ఇంకా ఇవ్వాల్సిన దానికి సంబంధించి లెక్కలు వేశారు. సమావేశంలో రైతు సంఘం నాయకుడు.. రబీ పంటలకు నీరు వదలాలని కోరారు. దీనిపై డిప్యూటీ సీఎం, జలవనరుల శాఖ మంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ.. జనవరి 10 వరకూ అన్ని కాలువలకు నీరు వదులుతామన్నారు. తరువాత తాగునీటి కోసం నిల్వ చేస్తామన్నారు. క్రస్ట్ గేట్లు అమర్చే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. డ్యాం భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. రైతులు, రైతు సంఘం నాయకులు పరిస్థితిని అర్థం చేసుకోవాలని సూచించారు. డ్యాంలో నీరు అలాగే ఉంచితే క్రస్ట్ గేట్లు అమర్చడం సాధ్యం కాదన్నారు. ఈసారి క్రస్ట్ గేట్లు అమర్చకపోతే వచ్చేఏడాది జలాశయానికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉన్నందున జనవరి నాటికి నీరు వదిలేసి, క్రస్ట్ గేట్లు అమర్చుతామని తేల్చిచెప్పారు.

ఓటమిలో రాహుల్‌గాంధీ రికార్డులు

- కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి ఎద్దేవా

బెంగళూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బిహార్ శాసనసభ ఎన్నికలలో బీజేపీ అనుబంధ పార్టీలు ఊహించనంత మెజారిటీ సాధించి చరిత్ర తిరగరాయగా కాంగ్రెస్ పార్టీ చిత్తుగా ఓటమి చెందింది. ఇదే దశలోనే రాష్ట్ర బీజేపీ అగ్రనేతలు.. రాహుల్‌గాంధీపై ఎద్దేవా చేశారు. కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి హుబ్బళ్ళిలో మాట్లాడుతూ క్రికెట్ మ్యాచ్‌లో సెంచరీలు కొట్టేవారు ఉంటారని కానీ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఓటమిలో సెంచరీకి దగ్గరగా చేరుతున్నారని ఎద్దేవా చేశారు. రాహుల్ పూర్తిగా మునిగిపోవడమే కాకుండా ఇతరులను అక్కున చేర్చుకుని వారిని నిలువునా ముంచేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఎవరితో పొత్తుపెట్టుకున్నా వారి పడవ కూడా నడిసముద్రంలో మునిగినట్లే నన్నారు. ఓటుచౌర్యం ముసుగును ప్రజలు తొలగించారని అదంతా కేవలం రాజకీయ లబ్ధికోసమేనని ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు.

ఊహించని గెలుపు : యడియూరప్ప


బిహార్ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి ఊహించని గెలుపు సాధించిందని మాజీ సీఎం యడియూరప్ప అన్నారు. కేవలం 125 స్థానాలు మ్యాజిక్ నెంబర్ కాగా 200 స్థానాలు సాధించడమంటే బీజేపీ అగ్రనేత ప్రధానమంత్రి నరేంద్రమోదీ పట్ల ప్రజలలో విశ్వాసం మరింత పెరిగినట్లే అన్నారు. ఇంతగా మెజారిటీ సాధ్యమని ఊహించలేదని కానీ కాంగ్రెస్‌కు బిహార్ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఓటు చౌర్యంపై లేని యాగీ చేసిన రాహుల్‌గాంధీకు బిహార్ ఫలితాలు కోలుకోలేని దెబ్బవంటిదన్నారు. ఇదే విషయమై ప్రతిపక్షనేత ఆర్ అశోక్ మాట్లాడుతూ ఓటు చౌర్యం ద్వారా ప్రజలను నమ్మించాలని భావించిన రాహుల్‌గాంధీకు బిహార్ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని గుర్తించాలన్నారు. ఓటమిలో రాహుల్‌గాంధీ రికార్డులు సాధించారన్నారు.



మల్లేశ్వరంలో బీజేపీ కార్యకర్తల సంబరాలు

బిహార్ ఫలితాలతో రాష్ట్ర నేతలకు గుబులు..!





- సేఫ్‌జోన్‌లోకి ముఖ్యమంత్రి సిద్దరామయ్య..!
- నాయకత్వ మార్పు అంశం ముగిసినట్లేనా..?
- రేపు సీఎం ఢిల్లీ పర్యటన కొనసాగేనా..?
- బీజేపీ అధ్యక్షుడి భవితవ్యమూ అయోమయం..!

బెంగళూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్లు బిహార్ శాసనసభ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర నేతలకు గుబులు పుట్టిస్తున్నాయి. ఆ రాష్ట్రంలో ఎన్డీయే కూటమికి తిరుగులేని మెజారిటీ రావడంతో బీజేపీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి. ఈ ఏడాదిలో బిహార్ ఎన్నికలను ఇటు కాంగ్రెస్ పార్టీ, అటు కేంద్రంలోని అధికార బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా భావించాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ బిహార్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఓటు సవరణ చట్టం ముసుగులో భారీ అక్రమాలు జరిగాయని జాతీయస్థాయిలో పోరాటం చేశారు. అందుకు కర్ణాటకలోని బెంగళూరు మహదేవపుర, కలబురగి జిల్లా అళంద నియోజకవర్గాలలో సాక్ష్యాలు ఉన్నాయని ప్రకటించారు. రాహుల్ గాంధీ ఆరోపించారని అళందలో ఓట్ల తొలగింపుపై ఏకంగా ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. మరోవైపు బిహార్ తర్వాత కర్ణాటకలోనూ ఓటుచౌర్యంపై రాహుల్‌గాంధీ భారీ సభ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సభ ముగిశాక ఎన్నికల కమిషన్ కార్యాలయానికి వెళ్తారని భావించినా రాహుల్‌గాంధీ వెనుదిరిగిన విషయం తెలిసిందే. కానీ సీఎం, డీసీఎంలతోపాటు పార్టీ జాతీయ కమిటీ జనరల్ సెక్రటరీలు కేసీ వేణుగోపాల్, సుర్జేవాలాలు ఎన్నికల అధికారికి వినతిపత్రాన్ని ఇచ్చారు. ఇలా బిహార్ ఓటుచౌర్యంపై ప్రకటిస్తూనే కర్ణాటకలోనూ పోరాటానికి కసరత్తు జరిపారు. ఇలా సాగుతున్న తరుణంలోనే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండున్నరేళ్ల పాలన ముగుస్తుండడంతో ముఖ్యమంత్రి మార్పు అనేది పెను చర్చనీయాంశంగా మారింది. రెండు నెలలుగా బిహార్ ఎన్నికలు ముగిసిన కొన్ని రోజుల్లోనే కర్ణాటకపై అధిష్ఠానం దృష్టి సారిస్తుందని... ఆ ప్రభావం ఎంతటికైనా దారి తీయవచ్చునని పార్టీలోనే అంతర్గతంగా చర్చలు సాగాయి. నాయకత్వ మార్పు ఉండదని, కానీ మంత్రివర్గ ప్రక్షాళన చేస్తారని మరో అంశం కూడా హల్‌చల్ చేసింది. స్వయానా ముఖ్యమంత్రి సిద్దరామయ్య కూడా ఎన్నికల ఫలితాల ముగిసిన మరుసటి రోజు నవంబరు 15న ఢిల్లీ వెళ్తానని, రెండుమూడురోజులు అక్కడే ఉంటానన్నారు. అధిష్ఠానం ఆదేశిస్తే ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటానని, మంత్రుల మార్పు విషయంపైనా చర్చిస్తానని చెప్పుకొచ్చారు. ఇదంతా ఫలితాలు వెలువడేందుకు ముందు బాగానే హాట్‌టాపిక్ గా మారింది. అయితే కాంగ్రెస్ పార్టీ ఇటీవలి రెండేళ్లలో దేశంలో జరిగిన ఏ ఎన్నికల్లోనూ ఇంత ఘోరంగా ఓటమి చవిచూడలేదు. లోక్‌సభ ఎన్నికల్లోనూ మూడోసారి ప్రతిపక్షనేత హోదాను దక్కించుకుంది. అటువంటిది పార్టీ అగ్రనేతలంతా బిహార్‌లోనే మకాం వేసి గెలుపుకోసం శతవిధాలా ప్రయత్నించారు. ఫలితాలు ఘోరం అనిపించాయి. శనివారం సీఎం ఢిల్లీ వెళ్తున్నా రాత్రికి వెనుదిరిగి వస్తున్నారు. అగ్రనేతలతో భేటీ అయ్యే పరిస్థితి లేకుండా పోయింది. పైగా రాహుల్‌గాంధీ విదేశాలకు వెళ్తారనే చర్చ కూడా ఉంది. రాహుల్ గాంధీ లేరంటే నిర్ణయం తీసుకునే అగ్రనేతలు ఎవరూలేరని చెప్పవచ్చు. అయోమయం, నాయకత్వ మార్పు అనే గందరగోళానికి కొంతకాలం బ్రేక్ పడినట్లే అయ్యింది. బిహార్ ఫలితాలతో కాంగ్రెస్ అగ్రనేతలు నోరు మెదిపే పరిస్థితి లేకుండా పోయింది. ఇటువంటి తరుణంలో మంత్రివర్గ ప్రక్షాళన, నాయకత్వ మార్పు అంశంతో ఎవరైనా ఢిల్లీ వెళితే ఎటువంటి పరిణామాలైన ఎదురు కావచ్చు. కేవలం సీఎం సిద్దరామయ్య కాదు.. మంత్రులు కూడా ఈ ఏడాది చివరిదాకా ఎటువంటి ఆందోళన లేకుండా కొనసాగవచ్చు అని పార్టీవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

బీజేపీ అధ్యక్షుడి భవితవ్యం అయోమయం

బిహార్ గెలుపుతో బీజేపీ ఉత్సాహానికి అవధులు లేకుండా పోయింది. ఈ ఏడాదిలో బిహార్ ఫలితాలు వెనుకబడితే ఎలా..? అనే చర్చ ఉండేది. వివిధ రాష్ట్రాలలో పార్టీకి సంబంధించి భారీ మార్పులు చేయకుండా మరికొంతకాలం కొనసాగించాలనే ఆలోచన కూడా ఉండేదని తెలుస్తోంది. దక్షిణాదిన బీజేపీకి అనుకూలంగా ఉండేది కేవలం కర్ణాటక మాత్రమే. ఇప్పటి వరకూ నేరుగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది దక్షిణాదిన ఇక్కడ మాత్రమే అనేది తెలిసిందే. అయితే ఇటీవల పార్టీలో గ్రూపు విభేదాలు తారాస్థాయికి చేరాయనేది తెలిసిందే. ఇతర పార్టీలతో బీజేపీని పోల్చలేమని కూడా ఎన్నోసందర్భాల్లో అగ్రనేతలు సైతం చెప్పిన సందర్భాలు ఉన్నాయి. కానీ రాష్ట్ర బీజేపీలోను ఇటీవల గ్రూపు విభేదాలు దారితప్పాయని చెప్పవచ్చు. సాధారణంగా పార్టీలో వేటు వేస్తే అది ఎన్నికల సందర్భంలో మాత్రమే అనిపించేది. అది కూడా పార్టీకి వ్యతిరేకంగా పోటీ చేయడం లేదా మరోపార్టీ అభ్యర్థికి మద్దతు ఇచ్చే అంశాలలో మాత్రమే జరిగేది. కానీ రాష్ట్ర బీజేపీలో ఏకంగా ముగ్గురు ఎమ్మెల్యేలపై ఇటీవల పలు కారణాలతో వేటు వేశారు. వారిలో ఇద్దరు ఒకప్పుడు కాంగ్రెస్ నుంచి వలస వచ్చి ప్రస్తుతం ఆపార్టీతో నేరుగా సంబంధాలు పెట్టుకోవడంతో వేటు వేశారు. అంతకు ముందు లోక్‌సభ ఎన్నికల వేళ పార్టీసీనియర్‌నేత ఈశ్వరప్ప ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన మేరకు వేటు వేశారు. రాష్ట్రంలో బీజేపీ ఏర్పాటుకు ఈశ్వరప్ప కఠోరమైన శ్రమ ఉందనడంలో సందేహం లేదు. పైగా బీజేపీ అగ్రనేతలను పొగడ్తలతోనే ముంచెత్తేవారు. స్థానికంగా ఉండే నేతలతోనే విభేదాలు ఉండేవి. ఈశ్వరప్ప సంగతి పక్కన పెడితే ఎమ్మెల్యేగా కొనసాగుతున్న ఒకప్పటి కేంద్ర మంత్రి, పార్టీ ఫైర్‌బ్రాండ్ అయిన బసనగౌడ పాటిల్ యత్నాళ్‌ను ఏకంగా పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఇది బీజేపీ, హిందూసంఘాలకు చెందిన వారిని జీర్ణించుకోలేనిదిగా తయారయ్యింది. ఆయనతో పాటు వ్యతిరేకించిన వారిలో పలువురు ఇటీవల కొంతమేర దూకుడు తగ్గించారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర పదవీకాలం ఒక విడత గడువు ముగిసింది. ఆయనను మార్పు చేయాలనేది మరో గ్రూపు డిమాండ్‌గా ఉంది. ఇదే విషయమై ఢిల్లీస్థాయిలోను ప్రయత్నాలు జరిగాయి. దాదాపు ఆరేడు నెలలుగా విజయేంద్ర పదవి మెడమీద తూగుతున్న కత్తిగానే ఉంది. ఇటీవల కొన్ని రోజుల ముందు ఇదే ప్రస్తావన రాగా బీహార్ ఎన్నికల తర్వాత అన్నింటినీ ప్రక్షాళన చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు దీంతో కర్ణాటక అధ్యక్షుడి మార్పు కూడా ఉంటుందా అనేది తీవ్రమైన చర్చకు కారణమవుతోంది. రాష్ట్ర బీజేపీలో అంతర్గతంగానే పావులు కదిపే ఓ గ్రూపు ఉండగా మరో గ్రూపు బహిరంగంగానే పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. పార్టీ అధ్యక్షుడి మార్పునకు అధిష్ఠానం ప్రయత్నించవచ్చని తెలుస్తోంది. దీంతో విజయేంద్ర పరిస్థితి కూడా డోలాయమానంగా మారిందని చెప్పవచ్చు.

బీజేపీ విజయోత్సవం

బిహార్ శాసనసభ ఎన్నికల ఫలితాలలో ఎన్డీయే మెజారిటీ సాధించిన నేపథ్యంలో నగరంలోని బీజేపీ కార్యాలయం వద్ద సందడి నెలకొంది. మల్లేశ్వరంలో శుక్రవారం కార్యకర్తలు బాణాసంచా కాల్చి సంబరాలు చేశారు. పార్టీ పతాకాలు చేబట్టి సందడి చేశారు. మిఠాయిలు పంచుకున్నారు.



దేవనహళ్ళి తాలూకా విజయపురలో బీజేపీ కార్యకర్తల సందడి

సేవే పరమార్థం..

● తిరుమల వలంటరీ వ్యవస్థకు స్ఫూర్తి

● ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులకు అండగా..

120 దేశాల్లో సత్యసాయి సేవాదళ్ కార్యక్రమాలు

పుట్టపర్తి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): 'ప్రార్థన చేసే పెదవుల కన్నా.. సేవ చేసే చేతులే మిన్న' అన్న సత్యసాయి బాబా బోధనలే మార్గదర్శకాలయ్యాయి. సేవే పరమార్థంగా పురుడు పోసుకున్న శ్రీసత్యసాయి సేవాదళ్ ప్రపంచ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేపడుతోంది. నిత్యం అనాథలు, అభాగ్యులకు అండగా నిలుస్తోంది. సత్యసాయి బాబా సేవే లక్ష్యంగా 1962లో శ్రీ సత్యసాయి సేవాదళ్‌ను స్థాపించారు. నాటి నుంచి 63 ఏళ్లగా సత్యసాయి భక్తులు సేవాదళ్‌గా ఏర్పడి సేవలు చేస్తున్నారు.



శిక్షణలో పాల్గొన్న సేవాదళ్ సభ్యులు

120 దేశాల్లో సేవలు

120 దేశాల్లో సత్యసాయి సేవాదళ్‌గా ఏర్పడి భక్తులు.. సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. అమెరికా, జర్మనీ, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, శ్రీలంక, చైనా, సింగపూర్, దక్షిణాఫ్రికా తదితర దేశాల్లో అక్కడి సత్యసాయి భక్తులే సేవాదళ్‌లో సభ్యులుగా చేరి సేవాకార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. ప్రకృతి విపత్తులు సంభవించినపుడు తామున్నామంటూ బాధితులకు అండగా నిలుస్తున్నారు. శ్రీలంక, జపాన్ దేశాల్లో సునామీ వచ్చినపుడు సేవాదళ్.. బాధితులకు అండగా నిలిచింది. 2000లో గుజరాత్ భూకంపం, అసోం, విజయవాడ వరదల సమయంలో బాధితులకు సేవాదళ్ అందించిన సేవలు ఎనలేనివి.



సేవాదళ్ సభ్యులకు సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న ఏపీ సేవాదళ్ అధ్యక్షుడు లక్ష్మణరావు

సేవకు ప్రతిరూపం

ఆపదలో ఉన్నవారికి సేవలు అందించడంలో సత్యసాయి సేవాదళ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఉచిత విద్య, వైద్యం, తాగునీరు, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం, రహదారుల నిర్మాణ పనులు చేస్తుంటారు. యువతకు ఉపాధి అవకాశాలు చూపేందుకు సాంకేతిక శిక్షణ ఇస్తుటారు. పేదలకు స్వయం ఉపాధి కోసం పనిముట్లను సైతం పంపిణీ చేస్తారు. అన్నదాన కార్యక్రమాలు చేపడతారు. భజనలు, నగర సంకీర్తనలు, నామస్మరణ, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, మానవతా విలువలు తెలియజేయడం, భారతీయ సంస్కృతిపై యువతకు శిక్షణ ఇస్తుంటారు.

ప్రపంచంలోనే అతిపెద్ద సేవాసంస్థ

ప్రపంచంలో ఏ సంస్థకు లేనంతమంది సభ్యులు సత్యసాయి సేవాదళ్‌కు ఉన్నారనడంలో అతిశయోక్తి లేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సేవాసంస్థల సభ్యుల సంఖ్య కోటికిపైగానే ఉంటుందని తెలుస్తోంది. ప్రతి ప్రాంతం, జిల్లా, రాష్ట్రం, దేశం సేవాసంస్థల కన్వీనర్ల ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు కొనసాగుతుంటాయి.

తిరుమలలో వలంటీర్ వ్యవస్థకు స్ఫూర్తి

శ్రీసత్యసాయి సేవాదళ్ తరహా వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీకారం చుట్టింది. గతంలో దేవస్థానం సభ్యులకు సత్యసాయి సేవాసంస్థల సభ్యులు శిక్షణ ఇచ్చారు. సేవాదళ్‌ను స్ఫూర్తిగా తీసుకుని తిరుమలలో వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

వేల సంఖ్యలో రానున్న సభ్యులు

సత్యసాయి బాబా శతజయంతి వేడుకల్లో భక్తులకు అవసరమైన అందించడానికి రాష్ట్రం, దేశం, ప్రపంచం నలుమూలల నుంచి వేలాదిమంది సత్యసాయి సేవాదళ్ సభ్యులు ప్రశాంతి నిలయం చేరుకుంటారు. 12రోజులపాటు ప్రశాంతి నిలయంలో నారాయణ సేవ, ఉచిత వైద్య శిబిరాలు, వృద్ధుల తరలింపు, పారిశుధ్య పనులు చేపడతారు.

అందరూ సమానమే..

సామాన్యుల నుంచి అత్యున్నత హోదా కలిగిన అధికారులు, కార్పొరేట్ సంస్థల అధినేతలు సైతం సేవాదళ్‌లో సభ్యులుగా ఉన్నారు. వీరిలో ఏ మాత్రం హోదా, డబ్బు, పదవి ఉందన్న గర్వం కనిపించదు. సత్యసాయి బోధనలే పరమావధిగా భావించి అవసరమైన వారికి అన్ని సేవలు అందిస్తారు. నిత్యం ప్రశాంతి నిలయం, దర్శనం హాలు, విద్యాసంస్థలు, ఆస్పత్రుల్లో సేవలందిస్తున్నారు. ప్రశాంతి నిలయంలో ప్రతి 15 రోజులకు కుమార సేవాసభ్యులు మారుతూ ఉంటారు. ఒక ప్రాంతం సభ్యులు 15 రోజులు సేవ చేసిన అనంతరం వారి ప్రాంతాలకు తిరిగి వెళ్తారు. తరువాత మరో ప్రాంతం నుంచి వచ్చిన సభ్యులు సేవల్లో చేరిపోతారు. ఈ ప్రక్రియ నిత్యం కొనసాగుతూ ఉంటుంది.





సత్యసాయిబాబాతో 1968లో కొత్తచెరువు జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులు (వలంటీర్లు)

రాయలసీమలో మొట్టమొదటి ఐ క్యాంప్

సత్యసాయిబాబా.. ప్రజలకు అందిస్తున్న సేవా కార్యక్రమాలలో భాగంగా 1968లోనే ప్రపంచ ప్రఖ్యాత చేతి కంటి ఆపరేషన్ నిపుణుడు డాక్టర్ మురుగప్పమోడీ ఆధ్వర్యంలో రాయలసీమలోనే మొట్టమొదటి ఐ క్యాంపు నిర్వహించారు. ఈ ఐ క్యాంపునకు వచ్చిన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొత్తచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలకు పదో తరగతి విద్యార్థులు 30 మంది వలంటీర్లుగా సేవలందించారు. వాటిని గమనించిన సత్యసాయిబాబాజ విద్యార్థులు, డాక్టర్ మురుప్పమోడీతో కలిసి ఫొటోను తీయించుకున్నారు.

- ఆంధ్రజ్యోతి, ధర్మవరం/కొత్తచెరువు

బాబాకు నేతాజీ అభినందన

ధర్మవరం/కొత్తచెరువు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన నేతాజీ సుభాష్‌చంద్రబోస్ 1942లో బుక్కపట్నం గ్రామానికి వచ్చినట్లు చెబుతూ సత్యసాయిబాబా 2007లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రసంగించిన ఆడియో ప్రస్తుతం సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. బుక్కపట్నం ప్రాంతానికి చెందిన ఎంకే దాసప్ప, గణేనాయక్‌లు పేద ప్రజల కోసం కమ్యూనిస్టులుగా మారి భూస్వాములు, బ్రిటీష్ వారిని ఎదిరించి పోరాటాలు చేశారు. వారి పోరాటం గురించి తెలుసుకుని, వారిని కలవడానికి 1942లో సుభాష్‌చంద్రబోస్ బుక్కపట్నం విచ్చేశారు. ఆ సమయంలో సత్యసాయిబాబా ఆధ్యాత్మిక ప్రసంగాలు విన్న నేతాజీ, సత్యసాయిబాబాను కలవడానికి వస్తున్నానని ఆంతరంగికుల ద్వారా కబురు పంపారు. ఇక్కడ నేతాజీ ఉండటానికి సరైన వసతి లేదని, తానే బుక్కపట్నం వస్తానని బాబా తిరిగి కబురు పంపారు. దీంతో సుభాష్ చంద్రబోస్ తన కారును పుట్టపర్తికి పంపి బాబాను బుక్కపట్నం రప్పించారు. సత్యసాయిబాబాను చూసిన నేతాజీ ఆలింగనం చేసుకుని 'చిన్నవయస్సులోనే ఆధ్యాత్మిక సందేశాలతో ప్రజలను చైతన్య పరుస్తున్నారు. మీ సేవలు, ప్రసంగాలు దేశప్రజలకు ఎంతో ఉపయోగమని' అభినందించినట్లు ఆ ప్రసంగంలో తెలియజేశారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన గొప్ప వీరుడు సుభాష్ చంద్రబోస్ అని, ఆయన పోరాటంతోనే స్వాతంత్ర్యం సిద్ధించిందని సత్యసాయిబాబా ఆ సమయంలో తెలిపారు.



పుట్టపర్తిలో కార్డెన్ సెర్చ్



పుట్టపర్తిలో ప్రజలకు సూచనలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పుట్టపర్తిరూరల్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను పురస్కరించుకుని ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు యంత్రాంగం భారీస్థాయిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించింది. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని కర్ణాటకనాగేపల్లి, పెద్దబజార్, సాయినగర్, చిత్రావతి రోడ్డు గుట్ట, ప్రశాంతిగ్రాంలోని ప్రతిఇంటినీ తనిఖీ చేశారు. ఎస్పీ ఆధ్వర్యంలో ఐదుగురు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 25 మంది ఎస్ఐలు, 250 మంది స్పెషల్‌పార్టీ పోలీసులతో సోదాలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చిన వ్యక్తుల వివరాలను సేకరించారు. రౌడీషీటర్లు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి ఇళ్లను పరిశీలించారు. తనిఖీల్లో డ్రోన్, బాడీవోర్న్ కెమెరాలు, మొబైల్ స్కానింగ్ డివైజ్‌లు, ఫింగర్‌ప్రింట్ స్కానర్లను ఉపయోగించారు.

50 వాహనాలు సీజ్

కార్డెన్ సెర్చ్‌లో నంబరు ప్లేట్లు, సరైన రికార్డులులేని 50వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. రికార్డులు చూపి వాహనాలను తీసుకెళ్లాలన్నారు. లేదంటే 102 సీఆర్‌సీసీ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రాత్రివేళల్లో అల్లర్లు, గొడవలుచేస్తే రౌడీషీట్లు తెరుస్తామన్నారు. బాబా శతజయంతి వేడుకల నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి స్థానికంగా లాడ్జీలు, హోటళ్లలో బసచేస్తున్నవారిపై ప్రత్యేకనిఘా ఉంచామన్నారు. లాడ్జి యజమానులు.. ప్రతిఒక్కరి వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. కార్డెన్ సెర్చ్‌లో డీఎస్పీలు విజయ్‌కుమార్, నరసింగప్ప, శివనారాయణస్వామి, హేమంత్‌కుమార్, మహేశ్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్పీ సీఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది, స్పెషల్‌పార్టీ బృందాలు పాల్గొన్నాయి.



ఇంటింటా తనిఖీలు నిర్వహిస్తున్న డీఎస్పీ విజయ్‌కుమార్, స్పెషల్‌పార్టీ పోలీసులు

భక్త సమ్మోహనం..

పుట్టపర్తి/టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శత జయంత్యుత్సవాలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. పుట్టపర్తికి భక్తుల తాకిడి విపరీతంగా పెరిగింది. చిత్రావతి నదిలో లేజర్ షో ఏర్పాటుచేశారు. ప్రభుత్వ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉత్సవాల రెండోరోజు శుక్రవారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ హాల్‌లో సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. విద్యార్థుల వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. సత్యసాయి విద్యార్థులు మధుర గానంతో భక్తులను అలరింపజేశారు. సాయంత్రం ప్రముఖ సితార విద్వాంసురాలు రూప బృందం భక్తులను అలరింపజేసింది. వేలాదిమంది భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. నారాయణ సేవ పేరిట 80వేల మందికి అన్నదానం చేశారు.

ప్రత్యేక ఏర్పాట్లు

● పుట్టపర్తికి వచ్చే భక్తుల కోసం రైల్వేస్టేషన్ నుంచి ప్రశాంతి నిలయం వరకు ఉచిత బస్సులు ఏర్పాటు చేశారు.

● సమీప ప్రాంతాల నుంచి దాదాపు 300 అదనపు బస్సు సర్వీసులు నడపనున్నారు. యాత్రికుల రద్దీని బట్టి వాటి సంఖ్యను పెంచనున్నారు.

● 165 ప్రత్యేక రైళ్లను నడపనున్నారు.

● ప్రశాంతి నిలయం పరిసర ప్రాంతాల్లో యాత్రికుల కోసం విస్తృతంగా మౌలిక సదుపాయాలు కల్పించారు.

● భోజన కౌంటర్లు, వైద్య శిబిరాలు, తాగునీటి ఏర్పాట్లు, రాత్రివేళ అవసరమైన లైటింగ్ సదుపాయాలు, వృద్ధులు, దివ్యాంగులకు మినీ బస్సుల ద్వారా ప్రత్యేక రవాణా సౌకర్యాలు

● మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 300 మంది శానిటేషన్ కార్మికులు, సూపర్‌వైజర్లను నియమించారు.

వీఐపీల రాకకు ప్రత్యేక ఏర్పాట్లు

● ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు ప్రధాన మంత్రి, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, గవర్నర్లు, రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేలు పుట్టపర్తికి రానుండడంతో అందుకనుగుణంగా ప్రత్యేక మార్గాలు, రవాణా సౌకర్యాలు సిద్ధం చేశారు.

● భద్రత కోసం 5000 మంది పోలీసులను నియమించారు.

● పుట్టపర్తి చుట్టుపక్కల 250 నిఘా కెమెరాలు ఏర్పాటు చేశారు.

17 నుంచి శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

సత్యసాయిబాబా శతజయంతి వేడుకల సందర్భంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 23వ తేదీ వరకు పుట్టపర్తిలోని శిల్పారామంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ ప్రకటనలో తెలిపారు. రోజూ సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ప్రముఖ కళాసంస్థల ఆధ్వర్యంలో ప్రదర్శనలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ఈనెల 15 నుంచి 25వ తేదీ వరకు డ్వాక్రాబజార్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు కేంద్రమంత్రి పీయూష్ గోయల్ రాక

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ శనివారం పుట్టపర్తి రానున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు విశాఖపట్నం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 3 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. అనంతరం ప్రశాంతి నిలయానికి చేరుకుని, సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొంటారు. ఆ తర్వాత ముంబైకి బయలుదేరి వెళ్తారు. సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో ఈనెల 17న నిర్వహించాల్సిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.





నారాయణ సేవకు క్యూలైన్‌లో నిల్చున్న మహిళలు, ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

సర్వం సిద్ధం: కలెక్టర్

సత్యసాయి శతజయంతి ఉత్సవాల విజయవంతానికి సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. పుట్టపర్తిలో నూతనంగా ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను శుక్రవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. పుట్టపర్తికి వచ్చే భక్తులు, యాత్రికుల కోసం విస్తృత స్థాయిలో రవాణా సదుపాయాలు కల్పించామన్నారు. అనంతరం రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. అక్కడి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.



పుట్టపర్తి రైల్వేస్టేషన్‌లో భక్తులతో మాట్లాడుతున్న కలెక్టర్

రేపు సహకార ఉద్యోగుల ఎన్నికలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ సహకార ఉద్యోగుల జిల్లా కమిటీ ఎన్నికలు ఈనెల 16న సుభాష్‌రోడ్డులోని ఎన్టీఆర్ సహకారభవన్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి సీనియర్ ఇన్‌స్పెక్టర్ కోటగుడ్డం లీలా తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, వెంటనే ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుందని తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని, బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ ఉంటుందన్నారు. పోలింగ్ బూత్‌లోకి మొబైల్ ఫోన్లను అనుమతించమనీ, సభ్యులు గమనించాలని కోరారు.

ఇంకెప్పుడు..?

మొక్కజొన్న కొనుగోళ్లపై తీవ్ర నిర్లక్ష్యం.. గత నెల రెండో వారంలోనే ప్రతిపాదనలు

కోతలు పూర్తైనా... ఏర్పాటుకాని కొనుగోలు కేంద్రాలు

అనుమతులు కూడా ఇవ్వని వైనం

బయట మార్కెట్‌లో అమ్ముకుంటున్న రైతులు





బెళుగుప్ప మండలం రమనేపల్లిలో ఆరబోసిన మొక్కజొన్న పంట

అనంతపురం అర్బన్/బెళుగుప్ప, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న రైతులకు కష్టకాలం వచ్చింది. గతనెల మొదటి వారం నుంచి కోతలు పూర్తై.. పంట చేతికొస్తున్నా.. ప్రభుత్వం మద్దతు ధరతో మొక్కజొన్న కొనుగోలు చేయడంపై దృష్టి సారించకపోవడం గమనార్హం. మొక్కజొన్న క్వింటాల్ మద్దతు ధర రూ.2400గా ప్రకటించింది. అక్టోబరు రెండో వారంలోనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం జిల్లా అధికారులు.. ఏపీ మార్క్‌ఫెడ్ ఎండీకి లేఖ పంపారు. అక్కడి నుంచి ప్రభుత్వానికి ఫైల్ పంపినట్లు సమాచారం. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు లేఖ పంపి నెల రోజులు దాటినా నేటికీ అనుమతులు మంజూరు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

కోతలు ప్రారంభమయ్యాక తగ్గిన ధర

ఈ ఏడాది ఖరీఫ్‌లో బోరుబావుల కింద జిల్లాలో మొక్కజొన్న సాగుచేశారు. జిల్లావ్యాప్తంగా 42వేల హెక్టార్లలో పంట పెట్టారు. ఈసారి 1.50 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా దిగుబడి వచ్చినట్లు అంచనా. అక్టోబరు ప్రారంభం నుంచి పంట కోతలు మొదలు పెట్టారు. అక్టోబరు రెండోవారానికే 95 శాతం కోతలు పూర్తయ్యాయి. తుఫాన్, వరుస వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో కోతలు వాయిదా వేసుకున్నారు. అలాంటి రైతులు ఈనెల మొదటి వారంలో పంట కోత కోశారు. పంట కోతల ప్రారంభంలో మొక్కజొన్న క్వింటా ధర రూ.2300 పలికింది. కోతలు పెరిగే కొద్దీ ధర తగ్గుతూ వచ్చింది. కొందరు దళారులు కుమ్మక్కై ధరను తగ్గించి, రైతులను దోపిడీ చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం క్వింటా ధర రూ.1700కి పడిపోయింది.

ప్రభుత్వం స్పందించేనా..!

గతేడాది ఎకరాకు 30 నుంచి 35 క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చింది. ఈసారి కొన్ని ప్రాంతాల్లో 15 నుంచి 20 క్వింటాళ్లు, మరికొన్నిచోట్ల 20 నుంచి 25 క్వింటాళ్లదాకా దిగుబడి వచ్చింది. గతేడాదితో పోలిస్తే ఈసారి మొక్కజొన్న పంట దిగుబడి తగ్గింది. అవసరంలేని సమయంలో వరుసగా వర్షాలు కురవడం.. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలోనే దిగుబడి తగినట్లు రైతులు వాపోతున్నారు. దిగుబడి తగ్గడానికితోడు ధరలు పడిపోవడంతో రైతులు మరింత నష్టపోయే ప్రమాదం ఉంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో కొందరు రైతులు తప్పని పరిస్థితుల్లో బయట మార్కెట్‌లో తక్కువ ధరకే పంట ఉత్పత్తులను అమ్ముకుంటున్నారు. మరి కొందరు ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయకపోతుందా..? అని ఆశతో ఎదురుచూస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు తక్షణమే అనుమతులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.

ధరలేక నష్టపోతున్నాం..



రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. పంట కోత సమయంలో ధర బాగానే ఉండింది. రోజుల వ్యవధిలో ధర భారీగా తగ్గించారు. బయట వ్యాపారులు క్వింటా రూ.1700కి అడుగుతున్నారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.2400 ప్రకటించడంతో ఎంతో ఆశలు పెట్టుకున్నాం. అడవుల్లో ఆరబెట్టుకుని ఉంటున్నాం. మద్దతు ధరతో ప్రభుత్వమే పంటను కొనుగోలు చేసి ఆదుకోవాలి.

- రైతు ఈరన్న, రమనేపల్లి, బెళుగుప్ప మండలం

తక్షణమే కొనుగోలు చేయాలి



మొక్కజొన్న పంట ఉత్పత్తులను ప్రభుత్వం తక్షణమే మద్దతు ధరతో కొనుగోలు చేయాలి. గతనెల మొదటి వారం నుంచే పంట కోతలు పూర్తై.. చేతికొస్తోంది. ఇప్పటికే పంట కోతలు వందశాతం పూర్తయ్యాయి. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని జిల్లా అధికారులు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అనుమతులు రాలేదు. జిల్లాలో పరిస్థితిని అర్థం చేసుకుని, తక్షణమే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి, రైతులకు మద్దత ధర కల్పించాలి. లేకపోతే ఈసారి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

- మధుసూదన్, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

ప్రతిపాదనలు పంపించాం..

జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు ఇప్పటికే ఏపీ మార్క్‌ఫెడ్ ఎండీకి ప్రతిపాదనలు పంపించాం. అక్కడి నుంచి ప్రభుత్వానికి కూడా నివేదికలు వెళ్లాయి. త్వరలోనే అనుమతులు వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే.. రైతు సేవాకేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించి, మొక్కజొన్న పంట కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటాం.

- పెన్నేశ్వరి, ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం

జేఎన్‌టీయూలో ఘనంగా నెహ్రూ జయంతి



నెహ్రూ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

అనంతపురంరూరల్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పరిపాలన భవనం, ఇంజనీరింగ్ కళాశాలలో దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పరిపాలన భవనంలో వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య తదితరులు.. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఇంజనీరింగ్ కళాశాలలోని నెహ్రూ విగ్రహానికి నివాళులు అర్పించారు. వీసీ మాట్లాడుతూ.. నెహ్రూ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. ఆయనలోని విశిష్ట వ్యక్తిత్వం, సమయపాలన, ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, ఆచార్యులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.17వేలు

అనంతపురం రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి ధర రూ.14వేలు పలికాయన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంమ్...

గోరా శాస్త్రి(జయంతి)



'గోరా'గా పేరొందిన గోపరాజు రామచంద్రరావు 1902 నవంబరు 15న ఒడిశా రాష్ట్రంలోని ఛత్రపురంలో జన్మించారు. సంపాదకులు, సంఘ సంస్కర్తగానే కాకుండా హేతువాది, నాస్తిక సిద్ధాంతాలతో జీవితాంతం కొనసాగారు. వర్ణ వ్యవస్థ, అంటరానితనంపై యుద్ధాన్ని ప్రకటించి 1940లో ప్రపంచంలోనే తొలి నాస్తిక కేంద్రాన్ని ప్రారంభించారు. నాస్తికత్వాన్ని నిర్మాణాత్మక జీవిత విధానంగా ప్రతిపాదించారు. ఎన్నో రచనలు చేశారు. పత్రికలు కూడా నడిపారు. మహాత్మా గాంధీతో కలసి అస్పృశ్యత నిర్మూలనకు పాటు పడ్డారు. దళితుల ఆలయ ప్రవేశాన్ని, సమష్టి భోజ నాలు, సామూహిక వివాహాలు నిర్వహించి సాంఘిక సమానతకు కృషి చేశారు. 1975 జూలై 26న తుది శ్వాస వీడారు. 2002లో గోరా జ్ఞాపకార్థం ప్రత్యేక పోస్టల్‌స్టాంప్ విడుదల చేశారు.

డాక్టర్ జీవీ కృష్ణారావు (జయంతి)



డాక్టర్ గవిని వెంకట కృష్ణారావు 1914 నవంబరు 15న జన్మించారు. తెనాలి ప్రాంతానికి చెందిన ఆయన హేతువాది, దార్శనికుడు కవి, సాహితీవేత్త, రచయితగా రాణించారు. కళాపూర్ణోదయం అనే సిద్ధాంత వ్యాసం రాసి మద్రాసు యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పొందారు. వరూధిని, శివరాత్రి, యుగ సంధ్య వంటి సుదీర్ఘ కవితలు రాసి ప్రచురించారు. 'కీలుబొమ్మలు' రచన ఎంతో పేరొందింది. ప్రముఖ తత్వవేత్తలు ప్లేటో అండ్ కాంట్‌ల రచనలను అనువాదం చేసిన ఘనత ఆయనది. 'భిక్షపాత్ర' నాటిక జాతీయస్థాయిలో గుర్తింపు పొంది 16 భాష లలో అనువాదమై ఆలిండియా రేడియోలో ప్రసారమైంది. 1979 ఆగస్టు 23న కన్నుమూశారు.

పాల్ఘాట్ కేవీ నారాయణస్వామి (జయంతి)



కర్ణాటక సంగీత గాత్ర విద్వాంసుడు, 'పద్మశ్రీ' గ్రహీత, పాల్ఘాట్ కొల్లెన్‌గోడ్ విశ్వనాథన్ (కేవీ) నారాయణస్వామి 1923 నవంబరు 15న కేరళ రాష్ట్రం పాల్ఘాట్ ప్రాంతంలో జన్మించారు. శృతి తప్పకుండా పాడేంతటి నేర్పరి. అసలు పేరు రామనారాయణన్ అయితే నారాయణ స్వామిగానే పేరొందారు. ట్రావెన్‌కోర్ రాజ కుటుంబీకులతో సన్నిహితంగా ఉండడంతో ఆయన ప్రతిభకు మరింత ప్రాచుర్యం లభించింది. అన్ని రకాల కీర్తనలను పలు భాషలలో ఆలపించారు. 1965లో స్కాట్లాండ్‌లో జరిగిన ఎడిన్‌బర్గ్ ఫెస్టివల్‌లో కచేరీలో పాల్గొన్నారు. వెస్లియన్ యూనివర్సిటీలో సంగీతం ప్రొఫెసర్‌గా వ్యవహరించారు. దేశ విదేశాలలో పర్యటించారు. సంగీత కళానిధి, సంగీత నాటక అకాడమీ అవార్డు తదితర గౌరవాలు అందుకున్నారు. 2002 ఏప్రిల్ 1న కన్నుమూశారు.

వాకాటి పాండురంగారావు (జయంతి)



ప్రముఖ తెలుగు కథా రచయిత వాకాటి పాండురంగారావు 1934 నవంబరు 15న మద్రాసులో జన్మించారు. జర్నలిస్ట్‌గా ఆంధ్రప్రభ వారపత్రికకు సుదీర్ఘకాలం సంపాదకీయాలు రాశారు. అనంతరం పలు ఆంగ్ల పత్రికలతోపాటు ఆంధ్రజ్యోతి, ఆనంద వాణి తదితర పలు పత్రికలలో సేవలందించారు. మిత్రవాక్యం, చేతవెన్నముద్ద, సృష్టిలో తీయనిది, దిక్సూచి ఆయన ప్రముఖ రచనలు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో అధ్యాపకులుగాను, విశాఖపట్నం పోర్టుకు డిప్యూటీ డైరెక్టర్‌గాను వ్యవహరించారు. ఆంధ్ర సాహిత్య అకాడమీ, గోపీచంద్ అవార్డు తదితర అవార్డులు అందుకున్నారు. 1999 ఏప్రిల్ 17న కన్నుమూశారు.

సానియా మిర్జా (పుట్టినరోజు)



ప్రముఖ టెన్నిస్ క్రీడాకారిణి సానియా మిర్జా 1986 నవంబరు 15న ముంబైలో జన్మించారు. ఆరు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించి జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు. 2003 నుంచి 2013వరకు రిటైరయ్యేదాకా సింగిల్స్‌లో దేశంలో నెంబరు వన్ ర్యాంకు క్రీడాకారిణిగా ఉమెన్స్ టెన్నిస్ అసోసియేషన్‌చే గుర్తింపు పొందారు. 2014లో డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో గెలుపొంది సత్తా చాటుకున్నారు. ఏసియన్ గేమ్స్, కామన్‌వెల్త్‌గేమ్స్, ఆఫ్రో-ఏషియన్ గేమ్స్‌లలోనూ రాణించి 14 మెడల్స్, ఇతర గౌరవాలు సాధించారు. 2023లో టెన్నిస్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం తరపున బ్రాండ్ అంబాసిడర్‌గా కొనసాగుతున్నారు. కాగా సౌత్ ఏసియాకు గుడ్‌విల్ అంబాసిడర్‌గా ఉన్నారు. పాకిస్థానీ క్రికెటర్ షోయబ్ మాలిక్‌ను వివాహం చేసుకున్నారు. అర్జున అవార్డ్ ఫర్ లాన్‌టెన్నిస్, పద్మ భూషణ్ తదితర పురస్కారాలు అందుకున్నారు.

చట్టబద్ధంగానే భూమిని కొన్నాం

సత్వ గ్రూప్ వివరణ

బెంగళూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేఆర్‌పుర పరిధిలోని బండాపురలో భూ వివాదానికి సంబంధించి నమోదైన కేసుతోపాటు ప్రకటనలకు సంబంధించి సత్వ గ్రూప్ వివరణ ఇచ్చింది. శుక్రవారం సత్వ గ్రూప్ అశ్విన్ సంచేటితోపాటు గ్రూప్ కార్యవర్గం ఒక ప్రకటన విడుదల చేసింది. 2023 ఆగస్టు 14న రాధతోపాటు వారసులైన నలుగురు పిల్లలతో కలసి 12 ఎకరాల 30 కుంటలను కొనుగోలు చేశామన్నారు. సత్వ గ్రూప్ ఎక్కడా అక్రమాలకు పాల్పడలేదన్నారు. సత్వ గ్రూప్ ఏళ్ల తరబడి రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో ఉందన్నారు. సంస్థపై నమోదైన కేసులకు సంబంధించి చట్టపరంగా సహకరిస్తామన్నారు. ఉద్యోగులు లేదా సంస్థ కార్యవర్గ సభ్యులు చట్టవ్యతిరేకమైన విధానాల్లో పాల్గొనలేదన్నారు. పోలీసు అధికారులకు సమగ్రమైన వివరాలు అందించడంతోపాటు విచారణకు సంపూర్ణంగా సహ కరిస్తామని ప్రకటనలో పేర్కొన్నారు.

డీవీజీ రచనల అధ్యయనంతో ఉజ్వల భవిష్యత్తు

జేఎంఎఫ్‌సీ ప్రధాన సివిల్ న్యాయాధికారి హరీశ్



వివిధ రంగాల్లో ప్రతిభావంత విద్యార్థులకు సన్మానం

ముళబాగిలు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సాహితీరంగంలో విశేష సేవలందించిన డీవీ గుండప్ప పెరిగిన స్థలంలో బాలల దినోత్సవాన్ని అత్యంత అర్థవంతంగా ఆచరించడం సంతోషంగా ఉందని జేఎంఎఫ్‌సీ ప్రధాన సివిల్ న్యాయాధికారి జీ హరీశ్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో తాలూకా న్యాయసేవల సమితి, న్యాయవాదులసంఘం, విద్యాశాఖ సంయుక్తంగా శుక్రవారం ఏర్పాటు చేసిన బాలల దినోత్సవం, పేరెంట్స్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. డీవీజీ సాహిత్య, ఆయన రచనలను పిల్లలు సమగ్రంగా అధ్యయనం చేయడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు సాధ్యమన్నారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని బాలల దినోత్సవం ఆచరిస్తున్నారని, బాలల హక్కులు, సంక్షేమం, విద్యపట్ల జాగృతి పెంచుకోవాలన్నారు. బాల్యంనుంచే క్రమశిక్షణతో విద్యను కొనసాగిస్తే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధ్యమన్నారు. పిల్లలకు గుణాత్మక అందించడంతోపాటు వారికి సంస్కారం నేర్పడంలో ఉపాధ్యాయులతోపాటు వారి తల్లిదండ్రులపై ఉందన్నారు. నేటి పోటీ ప్రపంచంలో పాఠాలతోపాటు పాఠ్యేతర అంశాలలోనూ క్రియాశీలకంగా పాల్గొనడం ద్వారా తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాజ్యాంగ పీఠికను చక్కగా చదివిన విద్యార్థులను అభినందించారు. వివిధ పోటీలలో ప్రతిభ చాటుకున్న విద్యార్థులను సన్మానించారు. తొలుత డీవీజీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో బీఈఓ కేఎన్ రామచంద్ర, ప్రధానోపాధ్యాయుడు సీ సొణ్ణప్ప, న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాసప్ప, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించేందుకే లక్ష్య



ప్రోత్సాహలు పొందిన విద్యార్థులతో ముఖ్యులు

బెంగళూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రతిభావంత విద్యార్థులు అవకాశాలకు దూరం కారాదనే ఉద్దేశ్యంతో ఆహ్వాన్ ఫౌండేషన్ లక్ష్య ప్రాజెక్టును ప్రారంభించింది. ఆహ్వాన్ ఫౌండేషన్ సీఈఓ బ్రజకిశోర్ ప్రధాన్ అధ్యక్షతన నగరంలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభావంత విద్యార్థులకు ప్రోత్సాహకం అందించారు. చిక్కపేట ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్, దర్శకుడు సుచేంద్రప్రసాద్, డీజీపీ ప్రణబ్‌మహంతి. ఆయుర్వేద ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ సీపీ కిశోర్, డీసీపీ మంజునాథబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రజకిశోర్ మాట్లాడుతూ 2009లో ఆహ్వాన్ ఫౌండేషన్‌ను బెంగళూరు కేంద్రంగా ప్రారంభించామన్నారు. ఆర్థికంగా వెనుకబడినవర్గాలకు అవసరమైన ఉపాధి, విద్య సమకూర్చడంతోపాటు పేదరిక నిర్మూలన, సామాజిక అభివృద్ధికోసం ఏర్పాటు చేశామన్నారు. లక్ష్య అనేది ఒక కార్యక్రమం కాదని మనసునుంచి వచ్చిన ఓ వాగ్దానం అన్నారు. ప్రతిభావంతులను గుర్తించి వారికి అవసరమైన ఆర్థిక చేయూత కల్పించడమే ముఖ్యమన్నారు. ప్రతి సంవత్సరం కనీసం 300 మందికి ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. పలువురు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు.

సృజనాత్మకతకు ప్రత్యేక కార్యాచరణ



నారాయణ గ్రూప్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ సింధూర తదితరులు

బొమ్మనహళ్ళి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు క్లబ్స్ కల్మినేషన్ 2025 కార్యక్రమం చేపట్టినట్టు నారాయణ గ్రూప్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ సింధూరా తెలిపారు. బన్నేరుఘట్టరోడ్డులోని హుళిమావులో శుక్రవారం ఏర్పాటైన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ హైస్కూల్ విద్యార్థులకు వీలుగా ప్రయోగాలు, భావ వ్యక్తీకరణ వంటివి నేర్పించేందుకు క్లబ్స్ దోహదపడతాయన్నారు. డిజిటల్ క్రియేటివిటీ, సినర్జీ ఎక్స్ (స్టెమ్ అండ్ ఏరోస్పేస్), ఐడియావాల్ట్ (ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్), గ్లోబల్ వాక్స్ వంటి క్లబ్‌లు ఏర్పాటు చేశామన్నారు. తద్వారా విద్యార్థులలోని సృజనాత్మకత వెలికితీసేలా చర్చా గోష్ఠులు, సదస్సులు ఉంటాయన్నారు. ఎక్స్‌ప్లోర్, డిజైన్, గ్రో, ఎక్సెల్ (ఎడ్జ్) ఫ్రేం వర్క్‌గా ఈ కార్యాచరణ రూపొందించామన్నారు. నేర్చుకోవడం, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయన్నారు. రెండు విడతలలో కల్మినేషన్ ప్రక్రియ ఉంటుందన్నారు. అకడిమక్ డీన్స్, క్లబ్ ట్రైనర్స్, ఆర్‌అండ్‌డీ బృందం, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు.

బీఎన్‌ఎంఐటీ కోటి ప్రోత్సాహకాలు



విద్యార్థులతో అతిథులు తదితరులు

బెంగళూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బీఎన్‌ఎంఐటీ కళాశాల 464 మంది విద్యార్థులకు ప్రోత్సాహకంగా కోటి రూపాయలు పంపిణీ చేసింది. కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎన్‌ఎక్స్‌పీ సెమి కండక్టర్ డైరెక్టర్ మల్లికార్జున బండె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యార్థులు ఆధునిక సమాజంలో ఉన్నారని అన్ని సౌలభ్యాలు మీ చెంతకే వస్తున్నాయన్నారు. మేం చదివే కాలంలో విద్యార్థులకు ప్రోత్సాహకాలు లేవని, మంచి విద్యాసంస్థలను ఎంపిక చేసుకునే పరిస్థితి లేదన్నారు. ప్రస్తుతం కేవలం ఒక మొబైల్‌తో ప్రాధాన్యత, అప్‌డేట్ వంటివి తెలుసుకునేందుకు వీలుందన్నారు. చదువుకుని ప్రయోజకులై సమాజం కోసం మీ వంతు భాగస్వామ్యం అందించాలని పిలుపునిచ్చారు. ఇంపాక్ట్ యునైటెడ్ వే కంపెనీ డైరెక్టర్ అనంతనారాయణ్, బీఎన్‌ఎంఐటీ విద్యాసంస్థల ఛైర్మన్ నారాయణరావ్ ఆర్ మానె, ప్రిన్సిపాల్ కులకర్ణి, కళాశాల డిప్యూటీ డైరెక్టర్ కృష్ణమూర్తి, డైరెక్టర్ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాంబారులో విషం.. 8 మందికి అస్వస్థత



ఘటనపై ఆరాతీస్తున్న ఎస్పీ కుశాల్‌చౌక్సి

బాగేపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పాతకక్షల నేపథ్యంలో విషపూరిత పదార్థాలు కలిపిన సాంబారు తినడం ద్వారా ఒకే కుటుంబానికి చెందిన 8మంది అస్వస్థతకు గురయ్యారు. తాలూకాలోని దేవరెడ్డిపల్లి గ్రామంలో గురువారం రాత్రి ఘటన చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన మద్దిరెడ్డి, భాగ్యమ్మ, మణి, సుబ్రమణి, ఈశ్వరమ్మ, మద్దక్క, మంజునాథ్, భానులు అస్వస్థతకు గురయ్యారు. వివరాలిలా. గ్రామంలోని మద్దిరెడ్డి, పాపిరెడ్డి ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. డ్రైనేజీ నీరు వెళ్లే అంశంపై ఇరు కుటుంబాల మధ్య గతంలో పలుమార్లు గొడవలు జరిగాయి. ఇందుకు సంబంధించి కేసులు కూడా నమోదయ్యాయి. ఇలా పాతకక్షల నేపథ్యంలో మద్దిరెడ్డి కుటుంబీకులను ఇబ్బంది పెట్టేలా విషంతో కూడిన ప్యాకెట్లను చౌడరెడ్డికి పాపిరెడ్డి ఇచ్చాడు. మద్దిరెడ్డి ఇంటికి వచ్చిన చౌడరెడ్డి నీరు తాగే నెపంతో వంటింటికి వెళ్లి సాంబారులో విషపూరితాన్ని కలిపాడు. ఆహారం తిన్న అనంతరం మద్దిరెడ్డి కుటుంబీకులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలోకి వెళ్లి ప్రథమ చికిత్స పొందారు. మెరుగైన చికిత్సకోసం చిక్కబళ్ళాపురకు తరలించారు. సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ కుశాల్‌చౌక్సి, ఏఎస్పీ జగన్నాథరైలు శుక్రవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామస్థులనుంచి ఆరాతీశారు. ఎస్పీ మాట్లాడుతూ ఘటనపై దర్యాప్తు చేపట్టి నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు. బాగేపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

బధిర విద్యార్థినికి ఎమ్మెల్యే చేయూత



బాలికను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

శిడ్లఘట్ట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వినికిడి సమస్యతో బాధపడుతున్న విద్యార్థిని పట్ల ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ మానవత్వం చూపారు. పట్టణంలోని సిద్ధార్థనగర్ నివాసి మునికృష్ణ కుమార్తె స్మితా తొమ్మిదో తరగతి చదువుతోంది. బాలిక వినికిడి సమస్యతో బాధపడుతోంది. దీంతో పాఠాలు చదవడానికి కూడా ఇబ్బంది పడుతోందనే విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే స్పందించారు. బాలిక విద్యాభ్యాసానికి ఇబ్బంది రాకూడదని జిల్లా దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారుల సూచనతో బెంగళూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో సమగ్ర వైద్యం అందించేలా చర్యలు చేపట్టారు. వైద్య పరీక్షలు ఇతరత్రా వాటికి రూ.5.72 లక్షలను ఎమ్మెల్యే గ్రాంట్ మంజూరు చేశారు. కాగా గోచర్ కంపెనీ అత్యాధునిక వినికిడి యంత్రాలను స్మితాకు ఉచితంగా సమకూర్చారు. ఎమ్మెల్యే కార్యవైఖరిపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తం అవుతున్నాయి.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం



పీహెచ్‌సీలో చిన్నారితో ఆప్యాయంగా ఎమ్మెల్యే మంజుళా లింబావళి

మహదేవపుర, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని బిళిశివాళె, వారణాసి, కిత్తగనూరు, బిదరహళ్ళి, కొడిగేహళ్ళి, బండాపూర్ తదితర ప్రాంతాలలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి శంకుస్థాపన చేశారు. శుక్రవారం బిదరహళ్ళిలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. భవన నిర్మాణ పురోగతి, అందుబాటులో ఉన్న వైద్యసదుపాయాలను పరిశీలించారు. రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు ఎక్కువగా పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు వస్తారని వారికి మెరుగైన వైద్యసేవలు అందించడం వైద్యులు, సిబ్బంది బాధ్యత అన్నారు. పీహెచ్‌సీలలో అవసరమైన వైద్య పరికరాలు, నిర్మాణ సామగ్రిని వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. గ్రామీణ ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించడంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో రూరల్ హోబళి బీజేపీ అధ్యక్షుడు హరాడి పిళ్ళప్ప, స్థానిక నాయకులు రాజేశ్, లోకేశ్, ధనంజయ్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ల ఢీ.. ఇద్దరి దుర్మరణం

రాయచూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు బలంగా బలంగా ఢీకొట్టుకోవడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలైయ్యారు. శుక్రవారం ఉదయం జిల్లాలోని లింగసుగూరు పట్టణ వెలుపల పెట్రోల్ బంక్ సమీపంలో ఈ ప్రమాదం చోటు చేసుకోగా బైక్ పై వెళుతున్న వారిలో 18 ఏళ్ల ప్రితమ్ అక్కడికక్కడే మృత్యువాతపడగా సిద్దయ్య స్వామి(37) తీవ్రంగ గాయపడి ఆస్పత్రికి తరలిస్తుండగా మృత్యువాతపడ్డాడు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు ఆనంద్ పత్తార్, సిద్దయ్య స్వామిలిద్దరు బైక్‌పై వెళుతండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ వీరిని బలంగా ఢీకొట్టింది. దీంతో రెండు బైకుల పై వెళుతున్న నలుగురు వ్యక్తులు తీవ్ర గాయాల పాలైయ్యారు. వీరిని స్థానికులు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా ప్రితమ్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన సిద్దయ్య స్వామిని బాగలకోట ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేస్తుండగా మార్గమధ్యలోనే ఆయన మృత్యువాతపడ్డాడు. మరో ఇద్దరి పరిస్థితి సహితం తీవ్ర గంభీరంగా ఉండడంతో వారిని జిల్లా ఆస్పత్రికి తరలించేందుకు బంధువులు సిద్ధమైయ్యారు. సంఘటన స్థళాన్ని పరిశీలించిన లింగసుగూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాబురావ్‌ను సస్పెండ్ చేసిన బీజేపీ



రాయచూరు, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): పార్టీ అగ్ర నాయకత్వం పట్ల ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం పై నిరంతరం విమర్శలు చేస్తున్న జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు బాబురావ్ పై సస్పెన్షన్ వేటు వేసింది. ఆయనను 6 సంవత్సరాల పాటు పార్టీ నుంచి బహిష్కరిస్తు బీజేపీ జిల్లాధ్యక్షుడు వీరనగౌడ పాటిల్ లక్కిహాళ్ గురువారం గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిపై వ్యక్తిగత విమర్శలు చేయడంతోపాటు కేంద్ర ప్రభుత్వం పని తీరుపైన పలు సందర్భాల్లో బాబురావ్ విమర్శనస్త్రాలు సంధించారు. దీంతో క్రమ శిక్షణ ఉల్లంఘించినట్లు భావించిన రాష్ట్ర నాయకత్వం ఆయనకు ఇప్పటికే శోకాస్ నోటీసు జారీ చేయగా దానికి సంతృప్తికరమైన సమాధానం రాకపోవడంతో వేటు వేసింది.

రుణాల పంపిణీ వేగవంతం చేయండి

ఎస్‌ఎల్‌బీసీలో చీఫ్ సెక్రటరీ శాలినీ రజనీశ్



ఎస్‌ఎల్‌బీసీ సమావేశంలో చీఫ్ సెక్రటరీ శాలినీ రజనీశ్ తదితరులు

బెంగళూరు, నవంబరు14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలకు అనుగుణంగా లబ్ధిదారులకు రుణాలు వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ అభిప్రాయపడ్డారు. విధానసౌధలో శుక్రవారం 172వ రాష్ట్రస్థాయి బ్యాంకర్స్ కమిటీ (ఎస్‌ఎల్‌బీసీ), 173వ ప్రత్యేక సమావేశం జరిగింది. అదనపు ముఖ్యకార్యదర్శి ఉమా మహదేవన్, కెనరాబ్యాంకు ఈడీ భవేంద్రకుమార్, ఆర్థికశాఖ కార్యదర్శి డాక్టర్ విశాల్, నాబార్డు జనరల్ మేనేజర్ పీసీ దాస్, ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ కాయత్రిపాఠి, కెనరాబ్యాంకు జనరల్ మేనేజర్, ఎస్‌ఎల్‌బీసీ కన్వీనర్ భాస్కర్ చక్రవర్తి పాల్గొన్నారు. సెప్టెంబరు ఆఖరుకు వ్యవసాయ రుణాలలో 52శాతం, ఎంఎస్‌ఎంఈ 69శాతం, ప్రాధాన్యత రంగాలలో 56శాతం సాధ్యమైనట్టు తెలిపారు.

పల్లెల్లో డిజిటల్ సేవలకు కనెక్ట్ ఏ కమ్యూనిటీ



అశుతోష్ దత్తా తదితరులు

బెంగళూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో డిజిటల్ అంతర్యాన్ని తగ్గించేందుకు హులిమంగలలో ఐఈఈఈ కనెక్ట్ ఏ కమ్యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించింది. జనాభాలో మూడోవంతు ఇంటర్నెట్‌కు చేరలేదని ఇంకా వెనుకబడి ఉన్నారని వారికి సేవలందించాలని శ్రీకారం చుట్టారు. హులిమంగల పంచాయతీ పరిధిలో 9 పల్లెల్లో ఫ్యూచర్ నెట్‌వర్క్ వరల్డ్‌ఫోరం కో-ఫౌండర్ అశుతోష్ దత్తా ఆధ్వర్యంలో సేవలు విస్తృతం చేశారు. అశుతోష్ మాట్లాడుతూ నగర ప్రాంతాలలో 5జీ నెట్‌వర్క్ వేగవంతమైన సాంకేతిక సేవలు పొందేందుకు సాధ్యమవుతోందన్నారు. కానీ గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటికీ ఇంటర్నెట్ సంపూర్ణంగా అందుబాటులోకి రాలేదన్నారు. అందుకే అమృతా యూనివర్సిటీ ఆరోగ్య పర్యవేక్షణ విధానంలో ఏఐ ఫర్ హెల్త్ అనే కార్యక్రమాన్ని డెమోగా ప్రదర్శింపచేశామన్నారు. నెట్‌వర్క్ విఫలమైతే సమస్యలు ఏవిధంగా తలెత్తుతాయనేది ప్రజలకు తెలియ చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాలలో సాంకేతికత ద్వారా విద్య, వైద్యంతోపాటు పలురంగాలను అమలు చేయాలనేది ఆశయమన్నారు.

పాఠశాలను సందర్శించిన డీడీపీఐ




హైస్కూల్‌ను పరిశీలిస్తున్న డీడీపీఐ రమేశ్ తదితరులు

శిడ్లఘట్ట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని సాదలి హైస్కూల్‌ను చిక్కబళ్ళాపుర డీడీపీఐ వీ రమేశ్ సందర్శించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణస్థాయిలో పదోతరగతి విద్యార్థులకు మరింత ప్రోత్సాహం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా విద్యార్థులు ఎక్కువ ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచిపేరు తెచ్చేలా తీర్చిదిద్దాల్సిన కర్తవ్యం ఉపాధ్యాయులపై ఉందన్నారు. సాదలి హైస్కూల్‌లో పిల్లలు చదివేం దుకు మంచి వాతావరణం కల్పించారని ప్రశంసించారు. పర్యవేక్షణ విధానం బాగుందన్నారు. హెచ్‌ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ కేవలం ఒక్క పర్మనెంట్ టీచర్ మాత్రమే ఉన్నారని, మరింతమందిని నియమించాలని డీడీపీఐని కోరారు. ఈ సందర్భంగా అంజినప్ప, లక్ష్మీకాంత, దేవేంద్రప్ప, తాలూకా వ్యాయామ ఉపాధ్యాయులు, సురేశ్ తదితరులు ఉన్నారు.

ఖోఖో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



లావణ్య



ముబీనా

దొమ్మసంద్ర, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా నెరిగ గ్రామ పంచాయతీ తిప్పసంద్రలోని శారద హైస్కూల్ విద్యార్థులు లావణ్య, ముబీనాలు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యాకు. విద్యాసంస్థల అధ్యక్షుడు కేశవరెడ్డి మాట్లాడుతూ తమస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. నిరంతర అభ్యాసం, క్రమశిక్షణ, ఉపాధ్యాయుల మార్గదర్శకంతోనే సాధ్యమైందన్నారు. డిసెంబరులో ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో జాతీయస్థాయి పోటీలలో రాష్ట్రజట్టు నుంచి వీరు భాగస్వామ్యం అవుతారన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.33	1631.86
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,158	7,264
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,615	10,069
నీటి నిల్వ (టీఎంసీలు)	77.58	101.23

చికిత్స పొందుతూ యువకుడి మృతి



కృష్ణ (ఫైల్)

బళ్లారిరూరల్,నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బళ్లారి రూరల్ తాలుకాలోని పరమ దేవనహళ్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కగ్గల్లు గ్రామానికి చెందిన కృష్ణ (21) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అనంత పురం రోడ్డు చేళగుర్కికి సమీపంలోని పెట్రోల్ బంకులో విధులు ముగించుకుని ఈనెల 10వ తేదీన ఇంటికి వెళ్తుడంగా బైకు అదుపుతప్పి కిందపడింది. తీవ్రంగా గాయపడిన యువకుడిని స్థానికులు గమనించి బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స ఫలించక యువకు డు కన్నుమూశాడు. పీడీహళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. యువకుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

అధిష్ఠానం ఆశీస్సులు ఎవరికో..?

- కార్పొరేటర్లతో అభిప్రాయ సేకరణ
- మేయర్ అభ్యర్థిపై ఆరా
- బరిలో ముండ్లూరు, గాదెప్ప తదితరులు
- ఉపమేయర్ పీఠం మైనార్టీలకే..!
- నేడు ఉత్కంఠకు తెర



బళ్లారి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బళ్లారి మహానగర పాలికె మేయర్ , ఉప మేయర్ పదవి ఎవరికి వరిస్తుందో..? కాంగ్రెస్ అధిష్ఠానం ఆశీస్సులు ఎవరికో..? అనే ఉత్కంఠ నెలకొంది. శనివారం ఎన్నిక జరుగున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం శుక్రవారం ద్విసభ్య కమిటీని బళ్లారికి పంపి కార్పొరేటర్లతో అభిప్రాయ సేకరణ చేపట్టింది. పాలికెలో మొత్తం 39 మంది కార్పొరేటర్లు ఉండగా 26 మంది కాంగ్రెస్‌కు చెందిన వారు. మిగిలిన 13 మంది బీజేపీ కార్పొరేటర్లు ఉన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ద్విసభ్య కమిటీ మేయర్, ఉప మేయర్ అభ్యర్థుల పై అభిప్రాయం సేకరించింది. మేయర్ ఎవరు ఉండాలనుకున్నారు.? అని సూటిగా కార్పొరేటర్లను అడిగింది. ఇందుకు కొందరు కార్పొరేటర్లు 3వ వార్డు కార్పొరేటర్ ముండ్లూరు ప్రభంజన్ పేరు చెప్పగా, మరి కొందరు తమరూ ఇవ్వాలని కోరారు. మైనార్టీలకు అవకాశం ఇవ్వాలని కొందరు కోరగా, మరి కొందరు బీసీల కోటాలో గాదెప్ప పేరు ప్రస్తావించారు. ఇంకొందరు అయితే ఎమ్మెల్యే భరత్ రెడ్డి ఎలా అంటే అలా అని, మాజీ మంత్రి నాగేంద్ర మాటకు కట్టుబడి ఉంటామని కొందరు పేర్కొన్నారు. ఎంపీ నాసీర్ హుసేన్ ఎలా అంటే అలా.. ఇంకొందరు అధిష్ఠానం ఎవరు పేరు సూచిస్తే వారికే ఓటేస్తామని కొందరు సభ్యులు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. చాలా మంది కార్పొరేటర్లు ముండ్లూరు ప్రభంజన్ పేరు చెప్పగా, అధిష్ఠానం మాత్రం గాదెప్ప పైనే మొగ్గు చూపిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎమ్మెల్యేల మద్దతు ఎవరికో..?

బళ్లారి మేయర్ అభ్యర్థిగా ఎమ్మెల్యేలు నారా భరత్‌రెడ్డి, మాజీ మంత్రి రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర, ఎంపీ నసీర్ హుసేన్ ఎవరి పేరు వెల్లడిస్తారో అనే ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది. వీరు రాజకీయ దూరదృష్టితో వ్యవహరిస్తారా లేదా నమ్ముకున్న వారికి మద్దతు ఇస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రభంజన్ చాలా ఏళ్లుగా ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డికి సన్నిహితులుగా ఉంటున్నారు అంటు నాగేంద్రతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఇక ఎంపీతో కూడా బాగా టచ్‌లో ఉన్నాడు. ఇంతక ముందు కూడా మేయర్ పదవి కోసం ప్రభంజన్ గట్టి పోటీ పడ్డాడు. ఇంటి గుమ్మం ముందు వరకూ వచ్చి ఇంట్లోకి రాలేక పోయినట్లు ఆయనకు వచ్చినట్లే వచ్చి పదవి రాకుండా పోయింది. ఈ సారి కూడా ఆయన గట్టిగానే ప్రయత్నం చేస్తున్నారు. మరి అదృష్టం కలిసొస్తుందా.? లేదా..?అనేది శనివారం తేలిపోతుంది. గాదెప్ప పేరు కూడా గట్టిగానే వినిపిస్తుంది. గాదెప్ప బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి, ముందు నుంచి పార్టీలో పట్టు ఉండే వాడు మరి ఆయన కూడా తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. అధిష్ఠాన వర్గం కూడా ఆయనకు కొంతలో కొంత అండ ఉందనే అభిప్రాయం ఉందని సమాచారం. ఇక మైనార్టీ కింద ఆసీఫ్, లేదా ముబీనా. సుకుం పేర్ల వినిపిస్తున్నాయి. ఉపమేయర్ పదవిని మైనార్టీలకే ఇచ్చేఅవకాశం ఉందని తెలుస్తుంది.



కరపత్రాలను విడుదల చేస్తున్న కన్వీనర్ రవికుమార్ తదితరులు

19న ఐక్యతా నడక

- సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా భారీ ర్యాలీ

బళ్లారి సిటీ,నవంబరు 14(ఆంధ్రజ్యోతి): దేశ తొలి హోంమంత్రి సర్దార్ వల్లబాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా నెహ్రూ యువ కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఈనెల 19న ఐక్యతా నడకను నిర్వహించనుందని, ఏక్తా నడక ఉంటుందని కన్వీనర్ రవికుమార్ తెలిపారు. నగరంలోని ప్రతికా భవనంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశం మొదటి సారిగా స్వాతంత్ర్య పొందినప్పుడు అనేక ప్రాంతాలుగా విభజింపబడిందని, ఈ ప్రాంతాలన్నింటినీ ఏకం చేయడానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి అమూల్యమైనదన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నిజాంను సైన్యంతో కూల్చివేసి మొత్తం హైదరాబాద్ ప్రాంతాన్ని దేశంలో విలీనం చేసిన ఘనత పటేల్‌కే దక్కుతుందన్నారు. ఆయన జ్ఞాపకార్థం ఆయన 150 జయంతిని పురస్కరించుకుని ఐక్యతా నడకను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈప్రచారం ఇప్పటికే దేశంలో నవంబరు 6 నుంచి 26వ తేదీ వరకు జరగుతోంది. ఈ వేడుక దేశవ్యాప్తంగా జరుగుతుందన్నారు. ఆ రోజు బళ్లారి నగరంలోని మున్సిపల్ హైస్కూల్ మైదానం నుంచి దొడ్డన గౌడ రంగమందిర వరకు ఐక్యతా నడక నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సంజీవ్ కుమార్, ఉలుగప్ప, సిద్దప్ప, ఎర్రన్న కుమార్, ఆదిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

బళ్లారిరూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉభయ జిల్లాల్లో చాచా నెహ్రూ జయంతిని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. తాలుకాలోని మోకా సమీపంలో ఉన్న మొరార్జీ దేశాయ్ రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణంలో ప్రిన్సిపాల్ అనసూయ నేతృత్వంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు షేక్ అన్నా, రామకోటి రెడ్డి, మంజునాథ, సుధాకర్ రెడ్డి, గంగాధర రెడ్డి, గౌరీ, అర్షియా, శివకుమార్, రాగిణితో పాటు ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. బళ్లారి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అల్లం ప్రశాంత్ నేతృత్వంలో నెహ్రూ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆర్మీ వెంకటేష్, ఏఐసీసీ కార్యదర్శి కేపీసీసీ ఉపాధ్యక్షులు రాజ్యం సీనియర్ నాయకులు, వీరసేనారెడ్డి, హుమయూన్ ఖాన్, ముండ్రిగి నాగరాజు, బుడా అధ్యక్షులు జేఎస్ ఆంజనేయులు, బోయపాటి విష్ణు, రాం ప్రసాద్, పేరం వివేక్, జీ శ్రీనివాస్, ఈరన్నగౌడ, బెనకల్ బసవరాజు, జగన్నాథ తదితరులు పాల్గొన్నారు.

- నగరంలోని శ్రీరాంపురం కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో జరిగిన బాలల దినోత్సవంలో సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత భవనంలో నడుస్తున్న పాఠశాలను త్వరలో కొత్త భవనంలోకి మారుస్తామన్నారు.



కాంగ్రెస్ కార్యాలయంలో..



మాజీమంత్రి నాగేంద్ర కార్యాలయంలో ..



ఆటల పోటీల్లో విద్యార్థులు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అనసూయ

హొసూరు జోన్

స్టేడియం నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ సత్య తదితరులు

హోసూరు నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పుట్టినరోజు సందర్భంగా కృష్ణగిరి పశ్చిమ జిల్లా డీఎంకే ఆధ్వర్యంలో ఈనెల 27నుంచి మూడు రోజులపాటు రాష్ట్రస్థాయి సీనియర్ కేటగిరీ కబడీ టోర్నమెంట్‌ను నిర్వహించనుంది. ఇందుకుగాను స్టేడియం నిర్మాణానికి శుక్రవారం తళి రోడ్డులోని అప్పావునగర్‌లో డీఎంకే జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే వై.ప్రకాశ్ నేతృత్వంలో భూమి పూజ చేశారు. మాజీ ఎమ్మెల్యే మురుగన్, మున్సిపల్ మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పుట్టినరోజు సందర్భంగా తమిళనాడు సాంప్రదాయ ఆట కబడ్డీని రాష్ట్రస్థాయి పోటీగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. పోటీలకు ఉపముఖ్యమంత్రి విచ్చేస్తారన్నారు. మంత్రి చక్రపాణి కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనడానికి 3 రోజులపాటు హోసూరులో బస చేస్తారన్నారు. పోటీలకు తమిళనాడు నలుమూలల నుంచి 40 సీనియర్ యువకలు జట్లు, 4 మహిళా జట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నాయన్నారు. ప్రథమ బహుమతిగా రూ.15 లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ.లక్ష, తృతీయ బహుమతిగా రూ.50 వేలు, నాల్గో బహుమతిగా రూ.50 వేలు అందజేస్తామన్నారు. మహిళా జట్టులో గెలిచిన జట్టుకు మొదటి రెండు జట్లకు తలా రూ.50 వేలు అందజేస్తామన్నారు. కృష్ణగిరి జిల్లా కౌన్సిల్ అధ్యక్షుడు యువరాజు, కోశాధికారి సుకుమారన్, రాష్ట్ర కళాసాహిత్య శాఖ ఉప కార్యదర్శి మాదేశ్వరన్, జిల్లా కౌన్సిల్ గోపాలకృష్ణ, జిల్లా ఉప కార్యదర్శి ధనలక్ష్మి, కౌన్సిల్ సభ్యులు చెన్నీరప్ప, వెంకటేశ్, మంజుళ మునిరాజ్, ఏరియా కార్యదర్శి రాము, యూనియన్ కార్యదర్శి గజేంద్రమూర్తి, భాగ్యరాజు, లోకేశ్‌రెడ్డి, జై ఆనంద్ పాల్గొన్నారు.

ఓటు నమోదుపై జాగృతి వాహనం ప్రారంభం



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

హోసూరు(కృష్ణగిరి) నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునే అంశంపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ దినేశ్‌కుమార్ శుక్రవారం ప్రత్యేక జాగృతి వాహనానికి పచ్చజెండా చూపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) 2026లో భాగంగా కార్యాచరణ సాగుతోంది. సమగ్ర ఓటరు జాబితా సిద్ధం చేయడమే లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. స్థానిక పోలింగ్‌బూత్ స్థాయి అధికారుల ద్వారా ఓటర్లకు రెండు ఫారంలు ఇవ్వనున్నారు. వివరాలు పొందుపరిచి సంతకం చేశాక సంబంధిత పోలింగ్‌స్టేషన్ స్థాయి అధికారులకు తిరిగి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కృష్ణగిరి జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలలోని 1096 పోలింగ్ కేంద్రాలలో ఈనెల 15, 16 తేదీలలో హెల్ప్‌డెస్కులు ఉంటాయన్నారు. సమగ్ర ఓటరు జాబితా ఫారాలను భర్తీ చేయడంలో సాయం చేస్తారన్నారు. కలెక్టర్ వ్యక్తిగత సహాయకుడు రామజయం, ప్రెస్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ అధికారి మోహన్, అరుళ్మోళి దేవన్, ఎన్నికల తహసీల్దార్లు సంపత్, రమేశ్, డెవలప్‌మెంట్ అధికారి ఉమాశంకర్ పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

హోసూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): హోసూరు ఆర్‌వీ ప్రభుత్వ బాలుర హయ్యర్ సెకండరీ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి పాఠశాల పూర్వ విద్యార్థి, హోసూరు కార్పొరేషన్ హెల్త్ కమిటీ చైర్మెన్ మాదేశ్వరన్ ప్రత్యేక అతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ వళర్మతి అధ్యక్షత వహించారు. పేరెంట్స్ టీచర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు సెందిల్‌కుమార్ అందరినీ స్వాగతించారు.



వేడుకల్లో టీచర్లు, విద్యార్థులు

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు శ్రీనంద విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో శ్రీ నంద పాఠశాల అధ్యక్షుడు గాంధీ

బళ్లారి సిటీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బళ్లారిలోని జిల్లా స్టేడియంలో జరిగిన తాలూకా స్థాయి, జిల్లాస్థాయి పోటీల్లో ప్రముఖ విద్యాసంస్థ శ్రీ నందా రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎన్నికయ్యారు. ప్రాథమిక విభాగానికి చెందిన సత్యసాయి వర్మ(7వ తరగతి) 400, 600 మీటర్ల పరుగులో మొదటి స్థానాన్ని, కావ్యశ్రీ (7వ తరగతి) 400మీటర్ల పరుగులో రెండవస్థానాన్ని, లాంగ్‌జంప్‌లో రెండవ స్థానాన్ని గెలుచుకుంది. సెకండరీ విభాగంలో ప్రదీప్(9వ తరగతి) 1500, 800 మీటర్ల పరుగులో రెండవ స్థానాన్ని, లాంగ్ జంప్‌లో రెండవ స్థానాన్ని గెలుచుకుంది. కావ్యశ్రీ(9వ తరగతి) 400మీటర్ల పరుగులో రెండవ స్థానాన్ని, హైజంప్‌లో మొదటి స్థానాన్ని గెలుకుకుంది. సుశాంత(9వ తరగతి) హైజంప్‌లో మొదటి స్థానాన్ని గెలుచుకుంది. కావ్యశ్రీ శ్రీనిధి, తనుశ్రీ, దివ్య(9వ తరగతి)రిలేలో రెండవ స్థానాన్ని గెలుచుకున్నారు.సత్యస్థాయి వర్మ(7వ తరగతి) 600మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, ప్రదీప్ (9వ తరగతి)లాంగ్ జంప్‌లో మొదటి స్థానం, రామోజి చెస్‌లో (9వ తరగతి) మొదటి స్థానం. ఈ నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా శ్రీనందా రెసిడెన్షియల్ స్కూల్ అధ్యక్షుడు గాంధీ మాట్లాడుతూ ఆటలు అడటం వల్ల శారీరకంగా మానసికంగా బలంగా ఉంటారన్నారు. ఆరోగ్యంతో పాటు వారు జీవితంలో స్ఫూర్తిదాయకమైన వ్యక్తులుగా మారడానికి క్రీడలు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుడు ఖాదర్‌బాష, రామన్ కుమార్, మురళీకృష్ణ, కిషోర్ కుమార్, శ్రీమతి సరిత, లక్ష్మీకాంత్ వినయ్ కుమార్ చౌదరి, శ్రీమతి రాజేశ్వరీ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

'పిల్లల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే'



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధ్యక్షురాలు పూజారి ఈరమ్మ

కంప్లి, నవంబరు14(ఆంధ్రజ్యోతి): పిల్లల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతిలోనే ఉంటుందని గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు పూజారి ఈరమ్మ, రమేష్ అన్నారు. శుక్రవారం వ్యక్తిత్వ వికాసంపై చేపట్టిన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందించడం ద్వారా పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని, విద్యతో పాటు వ్యక్తితత్వ వికాసం ముఖ్యమన్నారు. పిల్లలకు మంచి విద్యను అందించడం ప్రతి ఉపాధ్యాయుడి విధి అని హెచ్‌ఎం సోమశేఖర అన్నారు. ప్రతిభావంతులైన పిల్లలకు వారి పూర్వ విద్యార్థులు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ ఉపాధ్యక్షులు నాగరాజు, సభ్యులు బూదాల్ రవి, విరుపాక్షి, దేవరమనే మల్లికార్జున, వడియార్ స్వామి, వడ్రు జడెప్ప, పంపాపతి, శివరాజ్‌కుమార్, పూజప్ప, మంజునాథ, రామాలీ, గాదిలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల నిరసన

సిరుగుప్ప, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యలో శిరిగేరి గ్రామ ప్రజలు సతమతమవుతున్నారు. సిరుగుప్ప తాలుకాలోని సిరిగేరి గ్రామంలో వారం రోజులైన తాగునీరు విడుదల చేయకపోవడంతో ప్రజలు నానా అవస్థలుపడుతున్నారు. గ్రామ చుట్టు పక్కల ఎల్ఎల్‌సీ కాలువ, తుంగభద్ర నదులు ప్రవహిస్తున్నా పంచాయతీ అభివృద్ధి అధికారుల నిర్లక్ష్యం వల్ల తాగునీటి కోసం ఇబ్బందులు పడటం సిగ్గుచేటు విషయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా మహిళలు తాగునీటి బిందెలతో పంచాయతీ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



పంచాయతీ కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో బైఠాయించిన మహిళలు

'ఇంటింటికీ పోలీస్' ప్రారంభం



కురుగోడులో మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ శోభారాణి

కంప్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కురుగోడులో 'ఇంటింటికీ పోలీసు సేవ' కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. పోలీసులు ప్రజల దగ్గరికే వెళ్లి సమస్యలు పరిష్కరించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఎస్పీ శోభారాణి అన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలన్నారు. కురుగోడులో రాష్ట్ర పోలీసుశాఖ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజలకు అనుకూలమైన వ్యవస్థ ప్రజల్లో భద్రతాభావాన్ని సృష్టిస్తుందన్నారు. ఏ పరిస్థితిలోనైనా సహాయం చేయడానికి పోలీసు శాఖ సిద్ధంగా ఉందన్నారు. సీఐ విశ్వనాథ్ మాట్లాడుతూ పోలీసులు తమ ఇళ్లకు రావాలని లేదా ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలనే భావన వుండకూడదన్నారు. అటువంటి పరిస్థితిలో పోలీసు వ్యవస్థను ప్రజలకు అనుకూలంగా పరిపాలనకు అనుకూలంగా మార్చడానికి పోలీసు శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. పోలీసు వ్యవస్థ గురించి ప్రజల్లో ఆందోళన తొలగించడానికి పోలీసు సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలతో సంభాషిస్తారన్నారు. వారితో పాటు ఎస్ఐ సుప్రీత్ విరుపాక్షప్ప సిబ్బంది పాల్గొన్నారు.

కనకాచల ఆలయ హుండీ లెక్కింపు

కంప్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని కనకగిరి ఆరాధ్య దైవం కనకా చలపతి ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపు చేపట్టారు. హుండీలో రూ.9.64 లక్షలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. దేవదాయ శాఖ అధికారులు, తహసీల్దార్ విశ్వనాథ నేతృత్వంలో హుండీ లెక్కింపు జరిగింది. నాలుగు నెలల్లో హుండీకి రూ. 9.64 లక్షలు ఆదాయం వచ్చింది. నిధులను ఆలయ అభివృద్ధికి ఉపయోగిస్తామని దేవదాయ శాఖాధికారులు తెలిపారు. శిరసుదార అనిత, ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి సిద్దలింగయ్యస్వామి పాల్గొన్నారు.



హుండీ సొమ్ము లెక్కిస్తున్న సిబ్బంది

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారి డాక్టర్ సిద్దేశ్వర్



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ సిద్దేశ్వర్

బళ్లారి సిటీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చుట్టూ ఉన్న పర్యావరణాన్ని కాపాడుకోవాలని, అంది అందరి బాధ్యత అని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి జిల్లా పర్యావరణ అధికారి డాక్టర్ సిద్దేశ్వర్ బాబు అన్నారు. శుక్రవారం జిల్లా పారిశ్రామిక కేంద్రంలోని జాయింట్ డైరెక్టర్ కార్యాలయ హాల్లో ప్రాజెక్టు కింద పరిశ్రమలు , వాణిజ్య శాఖ, జిల్లాపారిశ్రామిక కేంద్రం నిర్వహించిన పర్యావరణ సామాజిక నిర్వహణ(ఈఎస్‌ఎం) ప్రాజెక్టుపై ఒక రోజు అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు బాధ్యతలను రూపొందించి ప్రాజెక్టుల ద్వారా అమలు చేయాలన్నారు. జిల్లాపారిశ్రామిక కేంద్రం జాయింట్ డైరెక్టర్ సోమశేఖర్, నైపుణ్యా అధికారి హట్టప్ప, చేనేత జౌళి శాఖ డిప్యూటీ డైరెక్టర్ మహంతేశ్ కంచిమఠ్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ పర్యావరణ అధికారి డాక్టర్ జయప్రకాష్, శ్రీమేథ ఎడ్యుకేషన్ గ్రూప్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్ కిరణ్, బీహెచ్‌క్వీ ప్రాజెక్ట్ వైస్ ప్రెసిడెంట్ ఉమా శంకర్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ శిక్షణ అధికారి సుదర్శన్, వినోద్‌కుమార్, శిక్షణ అధికారి జడెప్ప, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.